## క్లుప్తంగా

### ఏసు మార్గంలో పయనిద్దాం



అమరచింత: ఏసు క్రీస్తు ప్రబోధించిన సూక్తులను ప్రతి ఒక్కరూ ఆచరించడంతో సమాజంలో ఉత్తమ మానవుడిగా ఎదుగుతామని పాస్టర్ హ్యాపిపాల్ అన్నారు. పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చి ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 17 వరకు జీఎల్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బైబిల్ శిక్షణ తరగతుల కార్యక్రమానికి క్రైస్తవ విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలల సెలవు దినాల్లో విద్యార్థులకు ఇతర వ్యాపకాలపై దృష్టి మళ్లకుండా దేవుడి సన్నిధిలో ఉంటూ ప్రభు కీర్తనలు, ప్రవచనాలను తెలుసుకొని మంచి పౌరులుగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించామని వారు తెలపారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్లు బీఎస్ నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, అబ్రహం, సంతోష్, అచ్యుత్, రోజమ్మ పాల్గొన్నారు.

### శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి



అమరచింత: మండలంలోని మస్తీపురంలోని పశువుల ఆస్పత్రి వినియోగానికి నోచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. అమరచింత మండల ప్రధాన పశువుల ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న సబ్‌సెంటర్ కొన్నేళ్లుగా మరుగున పడింది. ఆస్పత్రి నిర్వహణ చూసుకోవడానికి కాంపౌండర్ సైతం నియమించకపోవడం, డిప్యూటేషన్‌పై పశుసిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో ఇక్కడి పశు సబ్‌సెంటర్ పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరకుండా చర్యలు తీసుకొని, పశువైద్య సిబ్బందిని నియమించాలని పాడి రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

### వేముల రోహిత్‌కు నివాళి



వీపనగండ్ల: కుల వివక్ష నిర్మూలనలో భాగంగా చేపట్టిన ఉద్యమంలో అసువులు బాసిన వేముల రోహిత్‌కు మండల కేంద్రంలో కేవీపీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, మండల కార్యదర్శి మురళి, నాయకులు నవీన్, వెంకటేశ్, నాగేశ్, రాము, వినయ్, సురేశ్, రాజ శేఖర్, సహదేవుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): 'యువశక్తి ఫౌండేషన్' నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ మేఘారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తక్కువ కాలంలో ఎంతో మంది గర్భిణులకు, తలసేమియా చిన్నారులకు, డెంగ్యూతో బాధపడే వారికి, ఆపదలో ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న యువశక్తి ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మధు, నరేష్‌యాదవ్, మోహన్, మణికంఠ, గణేష్, శంకర్, రఘు, హేమంత్, నాగరాజు, రాజేష్, రాఘవేందర్, గణేష్, సతీష్ తదితరులు ఉన్నారు.

### మానవత్వం చాటిన పోలీసులు

వనపర్తి క్రైం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాయుధ దళ కార్యాలయంలోని కానిస్టేబుల్ శివకుమార్ కుటుంబానికి తోటి బ్యాచ్ పోలీసులు రూ.2లక్షల ఆర్థికసాయం అందజేసి తమ మానవత్వాన్ని చాటారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మృతుడి కుటుంబానికి 1998 బ్యాచ్‌కు చెందిన వనపర్తి, నారాయణపేట ఏఆర్ పోలీసులు సేకరించిన రూ.2లక్షలు ఎస్పీ అపూర్వరావు సమక్షంలో అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ శివకుమార్ కుటుంబానికి తోటి కానిస్టేబుల్స్ ఆర్థికసాయం చేయడం అభినందనీయమని ఎస్పీ అభిప్రాయపడ్డారు.



# ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు?

- బస్టాండు లేక ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- రోడ్లపైనే వేచి ఉండే పరిస్థితి



మదనాపురంలో బస్టాండు లేకపోవడంతో రోడ్డు పక్కన నిల్చున్న ప్రయాణికులు

మదనాపురం: మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా మదనాపురం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. దీంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. బస్టాండు లేకపోవడంతో వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఎండకు, వానకు రోడ్లపైనే వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

**రైల్వే ప్రయాణికులకు ఇబ్బందే..**

వనపర్తి జిల్లాలోనే పెద్ద రైల్వేస్టేషన్ మదనాపురంలో ఉండటంతో హైదరాబాద్, కర్నూల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల ప్రయాణికులు ఇక్కడే దిగి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాలైన వనపర్తి, పెబ్బేరు, ఆత్మకూరు, అమరచింత, చిన్నచింతకుంట, అడ్డాకుల, కొత్తకోట తదితర ప్రాంతాలకు వెళ్తారు. ఇక్కడి నుంచి నిత్యం 2 వేల మంది ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. బస్టాండ్ లేకపోవడం వల్ల బస్సులు వచ్చే వరకు హోటళ్లు, పాన్ డబ్బాల వద్ద నిల్చుంటున్నారు. రెండేళ్ల క్రితం బస్టాండ్ నిర్మాణం కోసం స్థలం సేకరించినా.. నేటి వరకు అడుగులు ముందుకు పడట్లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పాలకులు, అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణం కోసం చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పాలకులు స్పందించాలి**



మదనాపురంలో బస్టాండ్ నిర్మాణం వెంటనే చేపట్టాలి. బస్టాండ్ లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి నుంచి ప్రతి రోజు వేల సంఖ్యలో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్తారు. పాలకులు చొరవ చూపి ప్రయాణికుల కష్టాలు తొలగించాలి.

– బాలు, మదనాపురం

**వర్షాకాలంలో ఇబ్బందులు**



మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడం వల్ల పలు గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. బస్సు వచ్చే వరకు రోడ్లపై వేచి ఉండాల్సి వస్తోంది. వర్షాకాలంలో వానకు, ఎండాకాలంలో ఎండకు నిలబడాల్సిన దుస్థితి. సత్వరమే పాలకులు స్పందించి బస్టాండ్ నిర్మాణంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– శ్రీధర్‌రెడ్డి, రామన్‌పాడు

# కేతేపల్లిలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని లైన్స్ క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ జూలూరు రఘు, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జూలూరు రఘు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు అన్నదానం, విద్య, వైద్యం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని తలకంటి ధీరజ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. శిబిరంలో 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఎంపీటీసీ శ్యామల, సింగిల్ విండో డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, బీరయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవి, మాజీ విండో డైరెక్టర్ రాజేష్‌రెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చిన్న కిషన్‌రెడ్డి, వైద్యులు ప్రదీప్‌రెడ్డి, గంగాధర్, లోక్‌నాథ్‌రెడ్డి, లైన్స్ క్లబ్ డాక్టర్లు దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, మహేందర్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమ్యశ్రీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని చెలిమిల్ల శివారులో కొల్లాపూర్ రోడ్డుపై బైకులు, జీపు ఢీకొట్టుకోవడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలలో.. మండలంలోని యాపర్లకు చెందిన నరసింహ, చిన్నగుమ్మడం గ్రామానికి చెందిన ఊశన్న వేరు వేరు బైకులపై స్వగ్రామానికి వెళ్తుండగా కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు వస్తున్న జీపు ఢీకొట్టడంతో బైకులపై ఉన్న వ్యక్తులకు గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఘనటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రామస్వామి తెలిపారు.

### కల్యాణం కమనీయం



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని జంగమాయపల్లి సమీపంలో గల కొమ్ములగట్టు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని అంగరంగా వైభవంగా జరిపించారు. ఎంపీపీ మేఘారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం జరగగా జంగమాయపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండల్, సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న వైద్య కార్మికులు

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వద్ద కార్మికులతో కలసి నిరసన తెలిపారు. శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా అందులో కోతలు పెడుతున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులు కోతలు పెట్టడంతో పాటు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీని కారణంగా కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, మోహినిద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

### చెక్కుల పంపిణీ



ఆత్మకూర్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను బాధిత కుటుంబాలకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అందజేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూర్‌కు చెందిన ఇద్దరికి, మోట్లంపల్లికి చెందిన ఒక్కరికి చెక్కులను అందించారు. అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న వీరు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సంప్రదించడంతో సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించారని తెలిపారు.

# షాదీఖానాకు అదనంగా రూ.80లక్షలు మంజూరు



మాట్లాడుతున్న రమేష్ గౌడ్, మైనార్టీ నాయకులు

వనపర్తి టౌన్: పట్టణంలో రూ.2కోట్లతో నిర్మిస్తున్న షాదీఖానాకు అదనంగా రూ. 80లక్షలు మంజూరైనట్లు వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, ముస్లిం మైనార్టీ నాయకులు గులాం ఖాదర్‌ఖాన్, సర్దార్ ఖాన్, ఎండీ రహీం, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు జోహేబ్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల, మతాలతో పాటు మైనార్టీలకు పెద్దపీట వేస్తోందన్నారు. వనపర్తి అభివృద్ధికి అన్ని విధాలుగా దోహదపడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో లక్ష పైచిలుకు మెజార్టీతో గెలిపించేందుకు ముస్లిం మైనార్టీలు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# 'కంటివెలుగు'ను విజయవంతం చేద్దాం



అమరచింతలోని ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ



నాగరాలలో..



వెనికితండాలో..

పాన్‌గల్: మండలంలోని అన్నారం, మాందాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న కంటి వెలుగు శిబిరాలను ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ కంటి వెలుగు కేంద్రాలకు వచ్చి పరీక్షలు చేయించుకునేలా గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. దీంతో పాటు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చాటింపులు వేయించి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాములు, జయరాములుసాగర్, జయకళ, మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని నాగసానిపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మండల మెడికల్ ఆఫీసర్ రాముడు, సర్పంచ్ ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు.

అమరచింత: మున్సిపల్ కేంద్రంలో ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పట్టణంలోని మూడో వార్డులోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరానికి అవసరమయ్యే మౌలిక వసతులను గుర్తించేందుకు వార్డు కౌన్సిలర్ విజయరాములుతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ పట్టణంలోని పది వార్డుల్లో వార్డుకు ఒకటి చొప్పున పది శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా భవనాల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి వసతులను గుర్తించి వాటిని యుద్ధ ప్రాతిపదికన సమకూర్చుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులతో పాటుగా ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని వెనికితండా, కోతులకుంట తండాల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటేష్‌గౌడ్, ఎంపీఓ రాజు తదితరులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజునాయక్, హెచ్ఈఓ నర్సింహులు సిబ్బంది విమల తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

వనపర్తి క్రైం: పట్టణ శివారులో గల ప్రభుత్వ భూములను కొందరు ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ పేరుతో కొంతకాలంగా యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుడు సతీష్‌యాదవ్ ఆరోపించారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని మంగళవారం తహసీల్దార్ రాజేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు వినతిపత్రాలు అందించామని, కానీ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మర్రికుంటలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ప్లాట్లు వేసి అమాయక ప్రజలకు అంటకట్టారని, కానీ ఇప్పుడు ట్యాంక్ బండు పేరుతో పనులు చేపడితే అక్కడి ప్రజలు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు వెంకటేష్, రాములు, గోపాలకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రజకుల అభ్యున్నతికి కృషి



విజయ్‌కి నియామక పత్రం అందిస్తున్న సంఘం పెద్దలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన విజయ్ వనపర్తి జిల్లా రజక సంఘం అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన రజక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో విజయ్‌ని జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన రజక సంఘాల నాయకులు ఆయనను తన నివాసంలో కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతు తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. జిల్లాలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పాపన్న, వెంకట్రాములు, కొండయ్య, వెంకటస్వామి, లక్ష్మయ్య, సత్యనారాయణ, అంజనేయులు, ఎర్ర సత్యనారాయణ, బాలస్వామి, కొత్తకోట లక్ష్మయ్య, ప్రవీణ్, మహేందర్, బాలరాజు, బాలస్వామి, సాయి కుమార్ పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

కోడేరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాయిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్, ఎద్దుల బండ్ల ప్రదర్శన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య హాజరై మాట్లాడారు. నర్సాయిపల్లి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇప్పటికే రోడ్లు విస్తీర్ణ సగంలో ఆగాయని, పనుల పూర్తికి ప్రజలు సహకరించాలన్నారు. గ్రామంలో 70 ఎకరాలు ప్రభుత్వ భూమి చూపితే బీసీ డిగ్రీ కళాశాల మంజూరు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సత్యానారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడా మైదానాలకు స్థలాలు కరువు



సింగంపేటలో మహిళా సమాఖ్య భవనం ఎదుట క్రీడా మైదాన బోర్డు



పట్టణ పరిధిలోని వసతి గృహ మైదానంలో చంద్రనాయక్‌తండా క్రీడాప్రాంగణ బోర్డు

అమరచింత: మండలంలోని సింగంపేట, చంద్రనాయక్‌తండాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో క్రీడా మైదానాల ఏర్పాటు చేయాలన్న లక్ష్యం అటకెక్కింది. రెవెన్యూ అధికారులు సింగంపేటలో ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేసినా.. ఆ స్థలం క్రీడా మైదానం ఏర్పాటుకు అనువుగా లేకపోవడంతో క్రీడా మైదాన బోర్డును మహిళా సమాఖ్య భవనం ఎదుటటేర్పాటు చేశారు. చంద్రనాయక్‌తండాలో ఎక్కడ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పట్టణ పరిధిలోకి వచ్చే వసతి గృహం మైదానంలో క్రీడా బోర్డును ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వపరంగా క్రీడా మైదానం కోసం స్థలాన్ని కొనుగోలు చేసి చంద్రనాయక్‌తండాలోనే ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

# సమస్యలు పరిష్కరించేందుకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీపీ ఉమామహేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సాయిరాం మాట్లాడుతూ. ప్రస్తుతం మంచాలకట్ట రూ.5లక్షలు, జటప్రోలు రూ.15లక్షలు, మల్లేశ్వరం రూ.5లక్షలు, పెంట్లవెల్లికి రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద గతేడాది హరితహారంలో భాగంగా లక్ష మొక్కల వరకు పెంచామని, ఈ సంవత్సరం 1.5 లక్షల మొక్కలు పెంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని అసిస్టెంట్ ఏపీఓ మోహన్ కృష్ణ తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా నీరు, కాలుష్యం, కరెంటు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతి గ్రామానికి అందేలా చూడాలన్నారు. పెంట్లవెల్లి, మాధవస్వామినగర్ సర్పంచ్‌లు మినహా మిగతా గ్రామాల సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో కోఆప్షన్ మెంబర్ మతిన్, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, ఎంపీడీఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### యువత క్రీడల్లో రాణించాలి

కొల్లాపూర్: యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రావు అన్నారు. సచిన్ లెవెన్ టీం ఆధ్వర్యంలో మినీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా పీసీ లెవెన్ జట్టు, రన్నరప్‌గా ఎస్‌డీ లెవెన్ జట్టు నిలిచాయి. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నరప్ జట్టుకు రూ.20 వేల నగదును జగదీశ్వర్‌రావు అందజేశారు.